

రసవత్తరం చంద్రగిరి ఐపీఎల్
చంద్రగిరి ఐపీఎల్‌లో మండల స్థాయి పోటీలు చివరి దశకు చేరుకున్నాయి. ఇందులో రాయల్‌ఫైటర్స్ విజేతగా నిలిచింది. - 8లో



విశేష వాహనాలపై శ్రీవారి విహారం
అప్పలాయగుంటలో శ్రీప్రసన్న వేంకటేశ్వర స్వామివారికి సోమవారం హనుమంత, గజ వాహనసేవలు నిర్వహించారు. - 8లో

	గరిష్ఠం	కనిష్ఠం
తిరుపతి	39	28
చిత్తూరు	39	27
తిరుమల	36	24
గూడూరు	42	31
నగరి	41	29

న్యూస్‌రీల్

శ్రీవారి దర్శనానికి 24 గంటలు

తిరుమల : భక్తులతో తిరుమల కిక్కిరిసింది. క్యూ కాంప్లెక్స్‌ని 31 కంపార్ట్‌మెంట్లు నిండిపోయాయి. ఆదివారం అర్ధరాత్రి వరకు 87,344 మంది భక్తులు శ్రీవారిని దర్శించుకున్నారు. 39,957 మంది తలనీలాలు సమర్పించుకున్నారు. కానుకల రూపంలో హుండీ ద్వారా రూ.4.14 కోట్ల ఆదాయం వచ్చింది. టైం స్లాట్ టికెట్లు కలిగిన భక్తులకు సకాలంలోనే దర్శనమవుతోంది. దర్శన టికెట్లు లేని భక్తులకు 24 గంటల్లో దర్శనం లభిస్తోంది. ప్రత్యేక ప్రవేశ టికెట్లు కలిగిన భక్తులకు 2 గంటల్లోనే దర్శనమవుతోంది.

అతిసార నివారణపై విస్తృత ప్రచారం



బ్యానర్ ఆవిష్కరిస్తున్న జేసీ బాలాజీ

తిరుపతి అర్బన్ : అతిసార వ్యాధి నివారణపై క్షేత్రస్థాయిలో విస్తృతంగా ప్రచారం చేయాలని జేసీ డీకే బాలాజీ ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లో వైద్యాధికారులు, సిబ్బందితో కలిసి అతిసార నియంత్రణ కార్యక్రమాల బ్యానర్‌ను ఆవిష్కరించారు. జేసీ మాట్లాడుతూ వేసవి నేపథ్యంలో ఓఆర్ఎస్ ప్యాకెట్లు, జింక్ టాబ్లెట్లు అందుబాటులో ఉంచుకోవాలని సూచించారు. డయేరియా లక్షణాలు గుర్తించిన వెంటనే చికిత్స అందించాలని కోరారు. ఈ మేరకు 15 రోజులపాటు జిల్లా వ్యాప్తంగా అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని స్పష్టం చేశారు. కార్యక్రమంలో డీఎంహెచ్‌ఓ శ్రీహరి పాల్గొన్నారు.

జాబ్ మేళా పోస్టర్ ఆవిష్కరణ



తిరుపతి అర్బన్ : సూళ్లూరుపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఈ నెల 9వ తేదీన జాబ్‌మేళా నిర్వహించనున్నారు. సోమవారం ఈమేరకు కలెక్టరేట్‌లో జాబ్‌మేళా పోస్టర్‌ను జేసీ డీకే బాలాజీ ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ 16 కంపెనీల్లో వెయ్యి ఉద్యోగాలకు ఇంటర్వ్యూలు నిర్వహించనున్నట్లు వెల్లడించారు. నిరుద్యోగులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో డీఆర్డీఏ పీడీ జ్యోతి, జిల్లా నైపుణ్యాభివృద్ధి సంస్థ అధికారి శ్యామ్‌మోహన్ పాల్గొన్నారు.

ఆర్టీసీ ప్రయాణం సురక్షితం

తిరుపతి అర్బన్: సురక్షిత ప్రయాణం ఆర్టీసీ సొంతమవ్వాలని డీపీటీఓ చెంగల్‌రెడ్డి పిలుపునిచ్చారు. ప్రమాదాల నివారణకు సంబంధించి సోమవారం ఆయన తిరుపతిలోని తన కార్యాలయంలో కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా డీపీటీఓ మాట్లాడుతూ రోజూ తిరుపతి నుంచి తిరుమలకు 348 సప్తగిరి సర్వీసులు 1,600 ట్రిపులు తిప్పుతున్నట్లు వెల్లడించారు. ఈ క్రమంలో రోజూ 80వేల మంది భక్తులు తిరుపతి–తిరుమల మధ్య రాకపోకలు సాగిస్తున్నారని తెలిపారు. ఇటీవల సాధారణ బస్సులతోపాటు ఎలక్ట్రికల్ బస్సులు సైతం ఘాట్‌రోడ్డులో ప్రమాదాలకు గురికావడం బాధాకరమన్నారు. డ్రైవర్లు తప్పకుండా ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని చెప్పారు. ప్రధానంగా ఘాట్‌రోడ్డులో 1వ కిలోమీటర్ రాయి శ్రీవారి శిలా రూపం వద్ద 12వ టర్నింగ్, 6వ కిలోమీటర్ రాయి సెక్యూరిటీ పోస్ట్ వద్ద 30వ టర్నింగ్, 8వ కిలోమీటర్ రాయి హరిణి వద్ద 38వ టర్నింగ్, 11వ కిలోమీటర్ రాయి 58వ టర్నింగ్, 7వ కిలోమీటర్ రాయి లింగ్ రోడ్డు వద్ద ప్రమాదాలు అధికంగా జరిగే అవకాశాలున్న నేపథ్యంలో జాగ్రత్తలు పాటించాలని సూచించారు. డిప్యూటీ చీఫ్ ట్రాఫిక్ మేనేజర్ భాస్కర్, డిప్యూటీ చీఫ్ ఇంజినీర్ నరసింహులు, పీఓ పార్థసారథి, అసిస్టెంట్ ట్రాఫిక్ మేనేజర్ రామచంద్రనాయుడు, తిరుపడి డిపో మేనేజర్ బాలాజీ పాల్గొన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

చిత్తూరు కలెక్టరేట్ : ఉమ్మడి చిత్తూరు జిల్లా పరిధిలో ఉన్న బీఆర్ అంబేడ్కర్ గురుకుల పాఠశాలల్లో పోస్టుల భర్తీకి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా కో ఆర్డినేటర్ జయభారతి తెలిపారు. ఆమె సోమవారం విలేకరులతో మాట్లాడుతూ అంబేడ్కర్ గురుకుల పాఠశాలల్లో ఖాళీగా ఉన్న బోధన, ప్రత్యేక బోధన అతిథి ఉపాధ్యాయుల నియామకాలకు దరఖాస్తు చేసుకునేందుకు అవకాశం కల్పించామన్నారు. అభ్యర్థులు ఈ నెల 7వ తేదీలోపు చిత్తూరులోని డీసీవో కార్యాలయంలో దరఖాస్తులను అందజేయాలన్నారు. ఈ నెల 8న అంబేడ్కర్ గురుకులం (బాలికలు) పాఠశాలలో డెమో తరగతులు నిర్వహిస్తామన్నారు. దరఖాస్తు చేసుకునే అభ్యర్థులు ఖచ్చితంగా అన్ని ఒరిజినల్ సర్టిఫికెట్స్‌ను డెమో తరగతులకు తీసుకురావాలని డీసీవో వెల్లడించారు.

ఆదాయం దిశగా అన్వేషణ

తిరుపతి జిల్లాలో ఆర్టీసీని మరింత ఆదాయ మార్గంలోకి తీసుకెళ్లేందుకు అధికారులు ప్రణాళిక రూపొందించారు. ప్రయాణికుల అవసరాలకు తగ్గట్టు అదనపు సర్వీసులు నడిపేందుకు కార్యాచరణ అమలు చేస్తున్నారు. ఈ మేరకు డిపో మేనేజర్లకు లక్ష్యాలను నిర్దేశించారు.



- అదనపు సర్వీసులు నడిపేందుకు ఆర్టీసీ అడుగులు
- తిరువణ్ణామలైకు ప్రతి రోజూ సర్వీసులు
- మరో 250 మార్గాల్లో 260 బస్సులు
- లక్ష్యాలను అధిగమించేందుకు ప్రణాళికలు

జిల్లా సమాచారం

ఆర్టీసీ డిపోలు	బస్సులు
11	814
విద్యుత్ బస్సులు	ఉద్యోగులు
100	4,250

నిత్యం రాకపోకలు సాగించే ప్రయాణికులు సుమారు 5.70 లక్షలు

రోజు వారీ ఆదాయం 1.60 కోట్లు

తిరుపతి అర్బన్ : తిరుపతి ఆర్టీసీ అధికారులు ఆదాయం పెంపొందించుకునేందుకు వినూత్న మార్గాలను అన్వేషిస్తున్నారు. రాష్ట్రంలో రాబడి పరంగా 2022–23కు సంబంధించి రూ.565 కోట్లతో తిరుపతి జిల్లా ప్రథమ స్థానంలో నిలిచింది. ఈ క్రమంలో 2023–24కు సంబంధించి రూ.700 కోట్లకు పైగా సాధించి మరో పర్యాయం కూడా స్టేట్ ఫస్ట్ సాధించేందుకు కృషి చేస్తున్నారు. ఇదే లక్ష్యంతో రెండు రోజులుగా జిల్లా ప్రజా రవాణాధికారి చెంగల్‌రెడ్డి నేతృత్వంలో డిపో మేనేజర్లతోపాటు వివిధ విభాగాల అధికారులతో సమావేశాలు నిర్వహిస్తున్నారు. అలాగే మంగళవారం తమిళనాడుకు చెందిన ప్రజా రవాణాశాఖ అధికారులతోను చర్చించారు. ప్రస్తుతం రోజు వారీ ఆదాయం 1.5కోట్లకు పైగా వస్తోంది. దీన్ని రూ.2 కోట్లకు పెంచేందుకు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నారు. జిల్లాలోని 11 డిపోల మేనేజర్లు ప్రతి నెలా నిర్దేశిత లక్ష్యాలను పూర్తి చేయాలని ఆదేశాలు జారీ చేశారు. ఓ వైపు పల్లె ప్రాంతాలకు బస్సులు నడుపుతూనే పట్టణాలు,నగరాలకు అదనపు సర్వీసులు ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. జిల్లాలో ప్రస్తుతం 100 విద్యుత్ బస్సులు నడుస్తున్న విషయం తెలిసిందే.ఈ సర్వీసులను అలిపిరి డిపో నుంచి ఆపరేటింగ్ చేస్తున్నారు. ప్రయాణికుల తాకిడి మేరకు ఇతర ప్రాంతాలకు కూడా విద్యుత్ సర్వీసులను నడపేందుకు చర్యలు చేపడుతున్నారు.



తిరుపతి ఆర్టీసీ బస్టాండ్

తమిళనాడులోని అన్ని ప్రాంతాలకు..

తిరుపతి జిల్లా నుంచి తమిళనాడుకు అధికంగా ఆర్టీసీ బస్సులు నడుపుతున్నారు. చెన్నై, కోయంబత్తూరు, తిరుచ్చి, రాయవేలూరు తదితర 156 రూట్లలో 210 సర్వీసులు రాకపోకలు సాగిస్తున్నాయి. జూన్ నుంచి మరో 54 సర్వీసులను అదనంగా ఆ రూట్లలో నడపడానికి రంగం సిద్ధం చేస్తున్నారు. అంతేకాకుండా తమిళనాడులోని అన్ని ప్రాంతాలకు జిల్లా నుంచి సర్వీసులు నడపడానికి ఆ ప్రభుత్వంతో చర్చలు జరుపుతున్నారు. రేపో మాపో ఒప్పందం కుదుర్చుకోనున్నారు. అనంతరం మరో 250 రూట్లలో 260 సర్వీసులను నడపడానికి సన్నాహాలు చేస్తున్నారు.

తిరువణ్ణామలైకి ప్రత్యేకం

తిరువణ్ణామలైకి పౌర్ణమి సందర్భంగా మాత్రమే తిరుపతి జిల్లా నుంచి ఆర్టీసీ సర్వీసులను నడుపుతున్నారు. ఇకపై ప్రతి రోజూ 6 నుంచి 10 సర్వీసులు నడపడానికి ఏర్పాట్లు చేస్తున్నారు. పౌర్ణమి రోజు ప్రత్యేకంగా 100 సర్వీసులను అదనంగా ఏర్పాటు చేయనున్నారు. ఏసీ బస్సులను సైతం కేటాయించాలని నిర్ణయించారు. ఈ మేరకు రిజర్వేషన్ సౌకర్యం కల్పిస్తున్నారు. అలాగే తమిళనాడులోని ముఖ్యమైన ఆలయాలకు ఆర్టీసీ బస్సులు నడపే దిశగా అడుగులు వేస్తున్నారు.

ఫస్ట్‌లో నిలపడమే లక్ష్యం



ఆర్టీసీ బస్సుల ద్వారా తిరుపతి జిల్లాను రాష్ట్రంలో ప్రథమస్థానంలో నిలపడమే లక్ష్యంగా పనిచేస్తున్నాం. అవసరాలకు తగ్గట్టు అదనపు సర్వీసులు నడిపేందుకు ఏర్పాట్లు చేస్తున్నాం. ఈ మేరకు ఆర్టీసీ సిబ్బంది సమష్టిగా కృషి చేయాలని దిశానిర్దేశం చేశాం. ఉద్యోగులందరూ బాధ్యతాయుతంగా పనిచేస్తే అనుకున్న లక్ష్యాన్ని సులువుగా అధిగమిస్తాం. ఆర్టీసీని మరింత ఆదాయ మార్గంలోకి తీసుకెళ్లేందుకు వినూత్న మార్గాలను అన్వేషిస్తున్నాం.

– తిమ్మాడి చెంగల్‌రెడ్డి,
జిల్లా ప్రజా రవాణాధికారి, తిరుపతి

తిరునగరికి సినీ గ్లామర్!



తారకరామా స్టేడియంలో గ్యాలరీలు

సాక్షి, తిరుపతి: తిరుపతి నగరానికి సినీ గ్లామర్ వచ్చేసింది. మంగళవారం స్థానిక తారకరామా స్టేడియంలో ఆదిపురుష్ ప్రీ రిలీజ్ వేడుక నిర్వహించనున్న నేపథ్యంలో సినీ ప్రముఖులు భారీగా తరలివస్తున్నారు. ప్రభాస్ సినిమా కావడంతో అభిమానులు పెద్దసంఖ్యలో రానున్నట్లు నిర్వాహకులు అంచనా వేస్తున్నారు. ఈ క్రమంలో పోలీసులు కట్టుదిట్టంగా బందోబస్తు ఏర్పాటు చేస్తున్నారు. సుమారు వెయ్యిమందితో భద్రతా చర్యలు చేపట్టనున్నట్టు ఎస్పీ పరమేశ్వరరెడ్డి తెలిపారు. నగరంలో ట్రాఫిక్ ఇబ్బందులు లేకుండా వాహనాలను మళ్లించేందుకు కసరత్తు చేస్తున్నారు. ఈవెంట్‌కు ముఖ్య అతిథిగా చినజీయర్ స్వామి హాజరుకానుండడం ప్రత్యేకతను సంతరించుకుంది. ఈ మేరకు చిత్ర యూనిట్ ట్వీట్ చేసింది. ఇప్పుడు సోషల్ మీడియాలో ఆదిపురుష్ చిత్రానికి సంబంధించి పోస్టర్లు వైరల్ అవుతున్నాయి. ఈ నెల 16వ తేదీన సినిమా విడుదల కానుండడంతో అంచనాలు పెరిగిపోతున్నాయి. ప్రీ రిలీజ్ ఈవెంట్‌లో 200 మంది సింగర్స్, 200 మంది డ్యాన్సర్లు ప్రదర్శన ఇవ్వనున్నట్లు తెలిసింది.

పాస్‌ల జారీ

తిరుపతి కల్చరల్/తిరుమల : రెబల్ స్టార్ యూత్ అసోసియేషన్ అధ్యక్షుడు ప్రసన్నకుమార్‌రెడ్డి ఆధ్వర్యంలో ప్రీ రిలీజ్ వేడుకకు పాస్‌లను పంపిణీ చేశారు. ఈ క్రమంలో హీరో ప్రభాస్ సోమవారం రాత్రి తిరుమలకు చేరుకున్నారు. మంగళవారం ఉదయం సుప్రభాతసేవలో శ్రీవారిని దర్శించుకోనున్నారు.



మెరుగు‘బడి’

- ఎన్ఐఆర్ఎఫ్ ర్యాంకింగ్‌లో ఎస్వీయూ ముందంజ

తిరుపతి ఎడ్యుకేషన్ : ఎన్ఐఆర్ఎఫ్ (నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ర్యాంకింగ్ ఫ్రేమ్ వర్క్) ర్యాంకింగుల్లో విశ్వవిద్యాలయాల విభాగంలో శ్రీవేంకటేశ్వర విశ్వవిద్యాలయం 2023వ సంవత్సరానికి 60వ ర్యాంక్ సొంతం చేసుకుందని, అలాగే ఇంజినీరింగ్ కళాశాలల ప్రగతిలో 151–200 స్థానం సాధించిందని వీసీ ప్రొఫెసర్ కె.రాజారెడ్డి తెలిపారు. గత ఏడాది 67వ ర్యాంకు పొందిన ఎస్వీయూ ఈ ఏడాది 60వ ర్యాంకు, అలాగే ఇంజినీరింగ్ కాలేజీల విభాగంలో 2022లో 251–300 స్థానం పొందిన ఎస్వీయూ ఈ సారి తన స్థానం మెరుగుపరచుకోవడం సంతోషకరమన్నారు. ఈ మేరకు సిబ్బంది కృషిని రిజిస్ట్రార్ ప్రొఫెసర్ మహమ్మద్ హుస్సేన్ అభినందించారు.

జిల్లా రిజిస్ట్రార్ బాధ్యతల స్వీకరణ

తిరుపతి అర్బన్: తిరుపతి జిల్లా రిజిస్ట్రార్‌గా జి.శ్రీరామ్‌కుమార్ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఒంగోలు జిల్లా రిజిస్ట్రార్‌గా పనిచేస్తున్న ఆయన తిరుపతికి బదిలీపై వచ్చారు. ఈ సందర్భంగా చిత్తూరుకు వెళ్లి డీఐజీ గిరిబాబును మర్యాదపూర్వకంగా కలిశారు.

బాధ్యతగా పర్యావరణ పరిరక్షణ



తిరుమలలో మొక్కలు నాటుతున్న ఈఓ ధర్మారెడ్డి



ర్యాలీ ప్రారంభిస్తున్న జేసీ బాలాజీ తదితరులు



స్పాట్ పోస్టర్ పెయింటింగ్‌లో విద్యార్థులు

తిరుమల : పర్యావరణ పరిరక్షణను ప్రతి ఒక్కరూ బాధ్యతగా భావించాలని టీటీడీ ఈఓ ఏవీ ధర్మారెడ్డి తెలిపారు. సోమవారం ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా తిరుమలలోని స్పెషల్ టైప్ కాటేజీల వద్ద మొక్కలు నాటారు. ఈఓ మాట్లాడుతూ వైకుంఠనాథుడు కొలువైన తిరుమల క్షేత్రాన్ని కాలుష్య రహితంగా తీర్చిదిద్దేందుకు చర్యలు చేపట్టామన్నారు. టీటీడీ అటవీ విభాగం ఆధ్వర్యంలో 2 వేల మొక్కలు నాటనున్నట్లు వెల్లడించారు. ఇందులో ఫైకాస్ డల్హౌసీ అనే రావి, మర్రి జాతికి చెందిన వృక్షాలు ఉన్నట్లు తెలిపారు. ఈ జాతి వృక్షాలు తిరుమలలో నాలుగు మాత్రమే ఉన్నాయన్నారు. తిరుమలలో పచ్చదనం పెంపొందించినందుకుగాను టీటీడీ ఇప్పటికే మూడుసార్లు పర్యావరణ అవార్డులు అందుకున్నట్లు వివరించారు. సప్తగిరులలో జీవవైవిధ్యం, పచ్చదనం పెంపొందించడంలో భాగంగా 3 వేల హెక్టార్లలో శ్రీ గంధం, మర్రి, రావి, మాను సంపంగి, పొగడ, కదంబం మొదలైన వృక్షాలను నాటుతున్నట్లు తెలిపారు. ఈఓ ధర్మారెడ్డితో కలిసి నర్సరావుపేటకు చెందిన పద్మ, అబుదాబికి చెందిన వంశీకృష్ణ మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో డీఎఫ్‌వో శ్రీనివాసులు, ఈఈ –1 జగన్‌మోహన్ రెడ్డి, ఈఈ (ఎఫ్ఎంఎస్) శ్రీనివాసరావు, డిప్యూటీ ఈఓ ఆర్2 భాస్కర్, ఎఫ్ఆర్‌ఓలు వెంకటసుబ్బయ్య, శ్రీనివాస్ పాల్గొన్నారు. అలాగే టీటీడీ అటవీ విభాగం ఆధ్వర్యంలో తిరుపతిలోని ఎస్వీ శిల్ప కళాశాల, తలనీలాలు భద్రపరుచు గోడౌన్, శ్రీ పద్మావతి మహిళా డిగ్రీ కళాశాల , జూనియర్ కళాశాల, ఎస్‌జీఎస్ డిగ్రీ కళాశాలల వద్ద 2 వేల మొక్కలు నాటారు.

తిరుపతిలో అవగాహన ర్యాలీ

తిరుపతి అర్బన్: పర్యావరణ దినోత్సవం సందర్భంగా తిరుపతిలో సోమవారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. కాలుష్య నియంత్రణ మండలి ప్రాంతీయ కార్యాలయం ఈఈ నరేంద్రబాబు నేతృత్వంలో ఎన్‌సీసీ, పరిశ్రమలు, వైద్య ఆరోగ్యశాఖల సమన్వయంతో ఏర్పాటు చేసిన ర్యాలీని ఎస్వీ ఆర్ట్స్' కళాశాల వద్ద జాయింట్ కలెక్టర్ బాలాజీ, అడిషనల్ ఎస్పీ కులశేఖర్ జెండా ఊపి ప్రారంభించారు. అనంతరం కళావేదికలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో జేసీ మాట్లాడుతూ పర్యావరణ రక్షణకు సమష్టిగా కృషి చేయాలని కోరారు. అడిషనల్ ఎస్పీ కులశేఖర్ మాట్లాడుతూ గాలి, నీరు, భూమి కాలుష్యం కాటుకు గురికాకుండా చూసుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా వివిధ పోటీలలో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు ప్రశంసా పత్రాలు అందించారు. పర్యావరణ పరిరక్షణపై ప్రతిజ్ఞ చేయించారు. ప్రకృతి ప్రేమికులను సన్మానించారు. కార్యక్రమంలో కాలుష్య నియంత్రణ మండలి ఏఈలు మదన్‌మోహన్‌రెడ్డి, శశికళ, కుమార్, ఎన్‌సీసీ 29 ఆంధ్ర బెటాలియన్ కల్నల్ శివరాజ్, వీరభద్రం, రీజనల్ సైన్స్ సెంటర్ కో–ఆర్డినేటర్ శ్రీనివాస నెహ్రూ, ప్రొఫెసర్ దామోదరం, వాకర్స్ అసోసియేషన్ ప్రతినిధి రామారావు పాల్గొన్నారు

పర్యావరణ సమతుల్యతకు కృషి

తిరుపతి ఎడ్యుకేషన్ : తిరుపతిలోని ఎస్వీయూ క్యాంపస్ హైస్కూల్‌లో ఏపీ శాస్త్ర సాంకేతిక మండలి (అప్‌కాస్ట్) ఆధ్వర్యంలో పర్యావరణ దినోత్సవం జరుపుకున్నారు. 3నుంచి 9వ తరగతి విద్యార్థులకు స్పాట్ పోస్టర్ పెయింటింగ్, వ్యాసరచన, వక్తృత్వ పోటీలు నిర్వహించారు. విజేతలకు బహుమతులు, సర్టిఫికెట్లు, ప్రశంసా పత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా డీఈఓ శేఖర్ మాట్లాడుతూ పర్యావరణ సమతుల్యతకు సమష్టిగా కృషి చేయాలని పిలుపునిచ్చారు. అనంతరం ర్యాలీ నిర్వహించి మొక్కలు నాటారు. కార్యక్రమంలో అప్‌కాస్ట్ జిల్లా కో–ఆర్డినేటర్ కె.ధనంజయ సారథి, డీసీసీ కోదండపాణి, సమగ్ర శిక్ష ఏపీఓ గోపాలకృష్ణ, జీసీడీఓ పుష్ప, అసిస్టెంట్ ఏఎల్ఎస్ వరలక్ష్మి పాల్గొన్నారు.

ఆదర్శనీయులు చినజీయర్‌స్వామి

కలువాయి : చినజీయర్ స్వామి ఆదర్శనీయులని, రూ.వెయ్యికోట్లతో సమతామూర్తి విగ్రహం నిర్మించి ప్రపంచానికే ఆధ్యాత్మిక నిర్దేశం చేశారని మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి కొనియాడారు. మండలంలోని రాజుపాళెంలో ఉన్న పరమానంద ఆశ్రమంలో ఏర్పాటు చేసిన గోశాలను చినజీయర్‌స్వామితో కలిసి మంత్రి ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ చినజీయర్ బోధనలు, ప్రవచనాలు, ప్రసంగాలు మానవాళి మనుగడకు ఉపయోగకరమన్నారు. పరమానంద ఆశ్రమాన్ని చినజీయర్ ట్రస్ట్‌లో విలీనం చేయడం శుభపరిణామని తెలిపారు. చినజీయర్‌స్వామి మహాశక్తిసంపన్నులని, వారి ఆశీస్సులు తనతోపాటు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిపై కూడా ఉండాలని కోరారు. గోశాల దాతలు ఆమర్తలూరు వెంకటేశ్వర్లు, శైలజ, ఆమర్తలూరు మణికంఠ, జయశ్రీ దంపతులను అభినందించారు.

పట్టు వస్త్రాల సమర్పణ

ఆశ్రమం ఆవరణలోని లక్ష్మీనరసింహ స్వామి వారికి మంత్రి కాకాణి గోవర్ధన రెడ్డి దంపతులు పట్టు వస్త్రాలు సమర్పించారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ మాదాసు గంగాధరం, జెడ్పీటీసీ సభ్యుడు బి.అనిల్‌కుమార్ రెడ్డి, సెంట్రల్‌బ్యాంక్ మాజీ చైర్మన్ వేనాటి శ్యాంసుందర్ రెడ్డి, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ ఎంవీ కృష్ణారెడ్డి పాల్గొన్నారు.



గోశాల ప్రారంభోత్సవంలో చినజీయర్‌స్వామి, మంత్రి కాకాణి గోవర్ధరెడ్డి తదితరులు

సమస్యలు పరిష్కరిస్తా..

ప్రజా సమస్యలన్నింటినీ పరిష్కరిస్తామని మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి స్పష్టం చేశారు. కలువాయి వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో ఆయన మాట్లాడారు. జెడ్పీటీసీ సభ్యుడు బి.అనిల్‌కుమార్ రెడ్డి తన దృష్టికి తీసుకువచ్చిన సమస్యలపై వెంటనే స్పందించారు. కార్యక్రమంలో ఎంపీపీ ఆర్.లక్ష్మీదేవి, ఉపాధ్యక్షుడు పంగా పెంచలనరసారెడ్డి, సొసైటీ చైర్మన్ చల్లా సుబ్బరామిరెడ్డి పాల్గొన్నారు.

పోషకాహార భద్రతకు పరిశోధన

తిరుపతి ఎడ్యుకేషన్ : ప్రజలకు పోషకాహార భద్రత కల్పించేందుకు వ్యవసాయ విశ్వవిద్యాలయాలు పరిశోధనలు చేయాలని రాష్ట్ర ఉన్నత విద్యా మండలి చైర్మన్ డాక్టర్ కె.హేమచంద్రారెడ్డి పిలుపునిచ్చారు. సోమవారం తిరుపతిలోని శ్రీ వేంకటేశ్వర వ్యవసాయ కళాశాల పీజీ విద్యార్థుల ఆధ్వర్యంలో 'వ్యవసాయ పరిశోధన–పోషకాహార భద్రత'' అనే అంశంపై రెండు రోజుల జాతీయ స్థాయి సదస్సును ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలోని వర్సిటీలను ఒకే గొడుగు కిందకు తీసుకొచ్చి వివిధ అంశాలపై సమన్వయం చేయడంతో పీజీ విద్యార్థుల సంఖ్య గణనీయంగా పెరిగిందన్నారు. ఆచార్య ఎన్‌జీ రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం వీసీ డాక్టర్ విష్ణువర్ధన్‌రెడ్డి మాట్లాడుతూ విద్యార్థులు వినూత్న ఆలోచనలతో పరిశోధనలు చేపట్టేందుకు జాతీయ సదస్సు దోహదపడుతుందన్నారు. అనంతరం వర్సిటీ పీజీ డీన్ డాక్టర్ జి.రామారావు మాట్లాడుతూ 578 మంది పీజీ విద్యార్థులు పరిశోధనా పత్రాలను సమర్పించారని తెలిపారు. సదస్సులో శాస్త్రవేత్తలు డాక్టర్ పి.బ్రహ్మానంద శ్రీనివాస్, డాక్టర్ పి.బాలసుబ్రమణియన్, డాక్టర్ ఎం.కృష్ణారెడ్డి, ఇక్రిశాట్ డిప్యూటీ డైరెక్టర్ జనరల్ డాక్టర్ అరవింద్‌కుమార్, అసోసియేట్ డీన్ డాక్టర్ జి.ప్రభాకర్‌రెడ్డి, ఏడీఆర్ డాక్టర్ సి.రమణ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఉన్నత విద్యా మండలి చైర్మన్ హేమచంద్రారెడ్డి

క్లుప్తంగా

భార్య గొంతుకోసిన భర్త


బాధితురాలు రేఖ

చౌడేపల్లి: కుటుంబ కలహాల కారణంగా భర్త ఆవేశంతో భార్య గొంతు కోసిన సంఘటన మండలంలో చోటుచేసుకుంది. బైరెడ్డిపల్లె మండలం తిర్లాకుప్పంకు చెందిన రేఖకు చౌడేపల్లె మండలం గోసలకురప్పల్లెకు చెందిన జి.నాగరాజుకు సుమారు 10 యేళ్ల క్రితం వివాహం జరిగింది. ఇటీవల వీరి కుటుంబంలో కలహాలు మొదలయ్యాయి. ఈ నెల 3వతేదీ శనివారం తమిళనాడులోని కృష్ణగిరికి చెందిన ఇద్దరు వ్యక్తులు ఇంటిలో నిద్రిస్తున్న నాగరాజను హత్యచేయడానికి యత్నించారు. ప్రతిఘటించిన నాగరాజ ప్రమాదం నుంచి తప్పించుకోగా వారు పరారయ్యారు. పరారైన వ్యక్తులు తన భార్య రేఖతో సన్నిహితంగా ఉందన్న చర్చ మొదలైంది. ఈ క్రమంలో గ్రామంలోని పెద్ద మనుషుల సమక్షంలో పంచాయతీ పెట్టారు. ఇంతలో నాగరాజ తనపై దాడిచేసిన వారితో పాటు భార్యపై పోలీసులకు ఫిర్యాదు చేశాడు. అందరూ పోలీస్ స్టేషన్ సమీపంలోని పెట్రోల్ బంకు వద్దకు చేరుకున్నారు. అందరూ మాట్లాడుతుండగా నాగరాజ కత్తితో రేఖ గొంతు కోశాడు. గుర్తించిన బంధువులు హుటాహుటిన స్థానిక ప్రభుత్వాస్పత్రికి తరలించారు. మెరుగైన వైద్యసేవల కోసం మదనపల్లెకు తరలించారు. ఈ విషయమై ఎస్‌ఐ రవికుమార్‌ను విచారించగా కేసు దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.



రసవత్తరంగా చంద్రగిరి ఐపీఎల్

- చిన్నగొట్టిగల్లు మండలం విజేత భాకరాపేట
- విజేతలకు ట్రోఫీలు బహూకరించిన జేసీ బాలాజీ, చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి


రన్నర్స్‌గా నిలిచిన దిగవూరు జట్టుకు ట్రోఫీ, నగదు అందిస్తున్న జేసీ బాలాజీ, మోహిత్‌రెడ్డి


విజేత భాకరాపేట జట్టుకు ట్రోఫీ, నగదు అందిస్తున్న జేసీ బాలాజీ, చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి

తిరుపతి రూరల్ : చంద్రగిరి నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి చెవిరెడ్డి మోహిత్ రెడ్డి నిర్వహిస్తున్న చంద్రగిరి ఐపీఎల్ పోటీలు రసవత్తరంగా సాగుతున్నాయి. ఇప్పటికే మండలస్థాయి పోటీలు చివర దశకు చేరుకున్నాయి. సోమవారం జరిగిన చిన్నగొట్టిగల్లు మండల ఫైనల్స్ మ్యాచ్‌లో భాకరాపేట జట్టు దిగవూరు జట్టుపై గెలుపొందింది. రామచంద్రాపురం, చంద్రగిరి, ఎర్రావారిపాళెం మండలాల జట్లు సైతం ఫైనల్స్‌కు చేరుకున్నాయి.

విజేతగా రాయల్ ఫైటర్స్

చిన్నగొట్టిగల్లు మండలం స్థాయి పోటీల్లో ఫైనల్స్ మ్యాచ్ రాయల్‌ఫైటర్స్ జట్టు(భాకరాపేట), ఎస్ఎస్‌కే (దిగవూరు) జట్ల మధ్య జరిగింది. మొదట బ్యాటింగ్ చేసిన రాయల్ ఫైటర్స్ జట్టు 15 ఓవర్లకు 84 పరుగులు సాధించింది. అనంతరం బ్యాటింగ్‌కు దిగిన ఎస్ఎస్‌కే జట్టు 74 పరుగులు చేసి ఓటమిపాలైంది. బెస్ట్ బ్యాట్స్ మన్‌గా జీవన్ కుమార్, బెస్ట్ బౌలర్‌గా గుణశేఖర్, బెస్ట్ ఆల్ రౌండర్‌గా గిరీష్ కుమార్ నిలిచారు.

ట్రోఫీల బహూకరణ

విజేతగా నిలిచిన రాయల్ ఫైటర్స్, రన్నర్స్ దిగవూరు ఎస్ఎస్‌కే జట్లకు జాయింట్ కలెక్టర్ బాలాజీ, టోర్నమెంట్ కార్యానిర్వాహక కమిటీ చైర్మన్ చెవిరెడ్డి మోహిత్ రెడ్డిలు ట్రోఫీలను అందించారు. మొదటి బహుమతిగా భాకరాపేట రాయల్ ఫైటర్స్ జట్టుకు రూ.లక్ష, దిగవూరు ఎస్ఎస్‌కే జట్టుకు రూ.75 వేలు, 3వ స్థానంలో నిలిచిన చిన్నగొట్టిగల్లు సీఎస్‌కే జట్టుకు రూ.50వేలు, 4వ స్థానంలో ఎగువూరుకు చెందిన బాబీ ఎలెవన్స్ జట్టుకు రూ. 25 వేలు మొత్తంగా రూ.2.50 లక్షలు నగదు బహుమతులను జేసీ బాలాజీ, చెవిరెడ్డి హర్షిత్ రెడ్డి చేతుల మీదుగా పంపిణీ చేశారు.

విశేష వాహనాలపై శ్రీవారి విహారం


గజ వాహనంపై స్వామివారు

వడమాలపేట : మండలంలోని అప్పలాయగుంటలో వెలసిన శ్రీప్రసన్న వేంకటేశ్వరస్వామి వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా సోమవారం ఆరోరోజు శ్రీవారికి హనుమంత, గజవాహనసేవలు నిర్వహించారు. ఈ సందర్భంగా వేకువజామునే స్వామి వారిని సుప్రభాతంతో మేల్కొలిపి నిత్యపూజాకైంకర్యాలు సమర్పించారు. అనంతరం వైకుంఠనాథుని విశేషంగా అలంకరించి హనుమంత వాహనంపై కొలువుదీర్చి మాడవీధుల్లో ఊరేగించారు. సాయంత్రం ఉత్సవర్లకు వసంతోత్సవం జరిపించారు. రాత్రి ప్రసన్న వేకటేశ్వరస్వామివారు గజ వాహనంపై మాడ వీధులలో విహరిస్తూ భక్తులను కటాక్షించారు. అనంతరం స్వామివారికి ఏకాంత సేవ నిర్వహించారు. కార్యక్రమంలో డిప్యూటీ ఈఓ గోవిందరాజన్, సూపరింటెండెంట్ శ్రీవాణి, టెంపుల్ ఇన్‌స్పెక్టర్ శివకుమార్, అర్చకులు సూర్యకుమారాచార్యులు, తిప్పాచార్యులు పాల్గొన్నారు.

భూ సమస్య పరిష్కారంపై హర్షం


ఆర్డీఓను సత్కరిస్తున్న గొట్టికాడు గ్రామస్తులు

గూడూరు: బాలాయపల్లె మండలం గొట్టికాడు గ్రామంలో దళితులు, భూస్వాములకు నడుమ మూడు దశాబ్దాలుగా నలుగుతున్న భూ వివాదాన్ని ఆర్డీఓ కిరణ్‌కుమార్ పరిష్కరించారు. సోమవారం ఈ మేరకు ఆర్డీఓను దళితులు కలిసి కృతజ్ఞతలు తెలిపి, ఘనంగా సత్కరించారు. ఏళ్ల తరబడి వేధిస్తున్న సమస్యలను పరిష్కరించడంపై హర్షం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో వసంత్‌కుమార్, రమేష్, కాంతారావు, సుజాత, రాజేశ్వరి పాల్గొన్నారు.

రాయితీపై డ్రిప్ పరికరాలు


సమీక్షిస్తున్న శివప్రసాద్‌రెడ్డి

తిరుపతి అర్బన్ : ఉద్యాన పంటలు సాగు చేస్తున్న రైతులకు రాయితీపై డ్రిప్ పరికరాలను పంపిణీ చేస్తున్నట్లు రాష్ట్ర ఉద్యాన సలహాదారు పి.శివప్రసాద్‌రెడ్డి తెలిపారు. సోమవారం తిరుపతిలోని ఉద్యాన శాఖ కార్యాలయంలో ఉద్యాన, డ్రిప్, పశు సంవర్ధక శాఖల అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం వ్యవసాయ పంటలతోపాటు అనుబంధ రంగాలను అభివృద్ధి చేసేందుకు సబ్సిడీలు ఇస్తోందన్నారు. డ్రిప్ పరికరాలపై 90శాతం వరకు రాయితీలు ఇస్తున్నట్లు వెల్లడించారు. ఉద్యాన శాఖ ద్వారా కలెక్షన్ సెంటర్లకు రూ.11.25 లక్షల సబ్సిడీతో రైతు గ్రూపులకు ప్రభుత్వం సాయం చేస్తున్నట్లు వివరించారు. రైతులు దళారీల బారిన పడకుండా డీఆర్‌డీఏ సహకారంలో వారే వ్యాపారం చేసుకునేలా చర్యలు చేపడుతుందన్నారు. అలాగే పాడి రైతులకు దాణా, పశువులను పంపిణీ చేస్తున్నట్లు వెల్లడించారు. కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ సలహా మండలి చైర్మన్ రఘునాథరెడ్డి, జిల్లా సూక్ష్మ సేద్యం అధికారి సతీష్, జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారి రవికుమార్, ఉద్యానశాఖ అధికారి సునీల్ పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ చిన్నారి మృతి

ఏర్పేడు : మండలంలోని మేర్లపాక వద్ద ఈ నెల 1వ తేదీన జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయపడి చికిత్సపొందుతున్న చిన్నారి భాన్వి తాక్షరి సోమవారం మృతి చెందినట్లు సీఐ శ్రీహరి తెలిపారు. పోస్టుమార్టం అనంతరం చిన్నారి మృతదేహాన్ని బంధువులకు అప్పగించినట్లు వెల్లడించారు.



బంగారం :

24 క్యారెట్లు 10 గ్రాములు	రూ.61,490
22 క్యారెట్లు ఒక గ్రాము	రూ.5,522
వెండి:	
హోల్‌సేల్ ధర (కిలో)	రూ.73,900
రిటైల్ వెండి గ్రాము	రూ.75.90

పులికాట్ పరిరక్షణకు కృషి


సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీ గురుమూర్తి

తడ: పులికాట్ సరస్సు పరిరక్షణకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, ఎమ్మెల్యే సంజీవయ్యతో కలిసి చిత్తశుద్ధితో కృషి చేస్తున్నట్లు ఎంపీ గురుమూర్తి తెలిపారు. సోమవారం ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని బీవీపాళెం పులికాట్ పడవల రేవు వద్ద మడ చెట్లను నాటారు. గురుమూర్తి మాట్లాడుతూ పులికాట్ ముఖద్వారం వద్ద పూడికతీయించడమే లక్ష్యంగా పనిచేస్తున్నామన్నారు. సరస్సులో మత్స్య సంపదను పెంచేందుకు చర్యలు చేపడుతున్నామని తెలిపారు. గూడూరు నియోజక వర్గంలోని రాయదొరువు వద్ద పులికాట్ సరస్సు ముఖద్వారం పూడికతీతకు ఇప్పటికే రూ.128 కోట్లు నిధులు విడుదల చేయాలని లేఖ రాసినట్లు వెల్లడించారు. ప్రధాన మంత్రి మత్స్య యోజన కింద రెండు బోట్లు మంజూరు చేసినట్టు వివరించారు. కోస్టు గార్డుల కోసం మరో రెండు బోట్లు కోరామని, ఇందుకోసం ఎంపీ ల్యాడ్స్ నుంచి కేటాయించనున్నట్లు చెప్పారు. అటవీ శాఖ సీసీఎఫ్ నాగేశ్వరావు మాట్లాడుతూ మడ అడవులు మానవాళితోపాటు మత్స్య సంపద, పక్షి జాతులకు ఎంతో అవసరమైనవన్నారు. ఇలాంటి చెట్లను కాపాడుకోవడం మన కర్తవ్యమని తెలిపారు. కార్యక్రమంలో తహసీల్దార్ కటారి జయజయరావు, ఎంపీడీఓ ఆమోస్ బాబు, రేంజ్ అధికారి వరప్రసాద్, నాటక అకాడమీ డైరెక్టర్ కళత్తూరు శేఖర్‌రెడ్డి, డీసీఎంఎస్ డైరెక్టర్ గండవరం సురేష్‌రెడ్డి, ఎంపీపీ రఘురెడ్డి, సూళ్లూరుపేట మున్సిపల్ చైర్మన్ దబ్బల శ్రీమంత్‌రెడ్డి, సర్పంచ్‌లు గీత, ఆర్ముగం, పరమశివంరెడ్డి, చిన్నప్పన్, వైస్ ఎంపీపీలు రమేష్, వెంకటేష్ పాల్గొన్నారు.

చెంగాళమ్మ తల్లి బ్రహ్మోత్సవాలు విజయవంతం చేద్దాం


మీడియాతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య

సూళ్లూరుపేట: సూళ్లూరుపేట శ్రీ చెంగాళమ్మ పరమేశ్వరి అమ్మవారి బ్రహ్మోత్సవాలను ఈనెల 8 నుంచి 14 వరకు అంగరంగ వైభవంగా నిర్వహించనున్న నేపథ్యంలో నియోజకవర్గంలోని అన్ని శాఖల అధికారులు, సిబ్బంది సమన్వయంతో పనిచేసి విజయవంతం చేయాలని ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య పిలుపునిచ్చారు. పట్టణంలోని టీవీఆర్ఆర్ కల్యాణ మండపంలో సోమవారం అన్ని శాఖలకు చెందిన అధికారులు, మీడియాతో సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. శాఖలవారీగా ఎవరెవరు ఏమేమి చేయాలో దిశానిర్దేశం చేశారు. ఒక టోల్‌ఫ్రీ నంబర్ రెవెన్యూ, మరొక టోల్‌ఫ్రీ నంబర్ పోలీస్‌శాఖ ఆధ్వర్యంలో పనిచేస్తాయన్నారు. బస్సుల పార్కింగ్‌కు అవసరమైన ఏర్పాట్లను స్థానిక ప్రభుత్వ పాఠశాల మైదానంలో చేపట్టినట్టు తెలిపారు. సమావేశంలో ఆర్డీవో ఆర్ చంద్రముని, ఆలయ చైర్మన్ దువ్వూరు బాలచంద్రారెడ్డి, ఈఓ ఆళ్ల శ్రీనివాసులురెడ్డి, సీఐ సోమయ్య, కమిషనర్ నరేంద్రకుమార్, తహసీల్దార్ కే రవికుమార్, రాష్ట్ర రైతు విభాగం కార్యదర్శి కళత్తూరు రామ్మోహన్‌రెడ్డి, దేవదాయశాఖ అధికారి రామకృష్ణారెడ్డి, మమత, రవీంద్రారెడ్డి, అన్ని శాఖల అధికారులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికే 'స్పందన'


సమస్య తెలుసుకుంటున్న జేసీ బాలాజీ


అర్జీ స్వీకరిస్తున్న ఎస్పీ పరమేశ్వర్ రెడ్డి

తిరుపతి అర్బన్ : ప్రజా సమస్యల పరిష్కారానికే స్పందన కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు జాయింట్ కలెక్టర్ డీకే బాలాజీ తెలిపారు.సోమవారం కలెక్టరేట్‌లో జరిగిన స్పందన కార్యక్రమంలో జేసీతోపాటు డీఆర్ఓ కోదండరామిరెడ్డి, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ శ్రీనివాసులు, ట్రైనీ కలెక్టర్ శ్రీలేఖ ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. జేసీ మాట్లాడుతూ నిర్దేశిత గడువులోపు ప్రతి అర్జీకి పరిష్కారం చూపాలని స్పష్టం చేశారు. కలెక్టరేట్ స్పందనకు మొత్తం 126 వినతులు వచ్చినట్లు అధికారులు వెల్లడించారు.

పోలీస్ స్పందనకు 104 అర్జీలు

తిరుపతి క్రైం : జిల్లా పోలీసు కార్యాలయంలో నిర్వహించిన స్పందన కార్యక్రమానికి 104 వినతులు అందినట్లు ఎస్పీ పరమేశ్వర్‌రెడ్డి తెలిపారు. ఆయా ఫిర్యాదులను సంబంధిత పోలీస్ స్టేషన్‌కు బదిలీ చేసినట్లు వెల్లడించారు. వాటిని పరిష్కరించి తమకు సమాచారం అందించాలని ఆదేశించినట్లు వివరించారు.

ఎల్లవకట్ట ఘటనలో మరొకరి మృతి


బాధిత కుటుంబానికి చెక్కు అందిస్తున్న ఎమ్మెల్యే ఆదిమూలం (ఇన్‌సెట్) పవన్ కల్యాణ్ (ఫైల్)

వరదయ్యపాళెం: మండలంలోని ఎల్లకట్టవ గ్రామంలో బాణసంచా గోదాము వద్ద ఇటీవల సంభవించిన ప్రమాద ఘటనలో సోమవారం మరో యువకుడు మృతి చెందాడు. పేలుళ్ల కారణంగా తీవ్రంగా గాయపడిన ఎ.పవన్‌కల్యాణ్(28) చెన్నైలో చికిత్స పొందుతూ మరణించినట్లు కుటుంబీకులు తెలిపారు. వలంటీర్‌గా సేవలందిస్తున్న పవన్ కల్యాణ్ ఉపాధి కోసం టపాకాయల తయారీ కేంద్రంలో రోజువారీ కూలీగా పని చేస్తున్నాడు. అతడికి భార్య, ఇద్దరు పిల్లలున్నారు. మృతుడి భార్య, పిల్లలు, తల్లిదండ్రులు కన్నీరుమున్నీరుగా విలపిస్తుండడం చూపరులను కలచివేస్తోంది. సత్యవేడు సీఐ శివకుమార్‌రెడ్డి, ఎస్ఐ నాగార్జునరెడ్డి చెన్నై ఆసుపత్రికి వెళ్లి కేసు నమోదు చేసి, పంచనామా అనంతరం మృత దేహాన్ని కుటుంబ సభ్యులకు అప్పగించారు.

రూ. 5లక్షల ఆర్థికసాయం

పవన్ కళ్యాణ్ కుటుంబానికి ప్రభుత్వం అండగా నిలిచింది. ఎమ్మెల్యే ఆదిమూలం ద్వారా వివరాలు తెలుసుకున్న ముఖ్యమంత్రి కార్యాలయం (సీఎంఓ) తక్షణమే రూ. 5లక్షల ఎక్స్‌గ్రేషియా పంపిణీ చేయాలని కలెక్టర్‌ను ఆదేశించింది. ఈ మేరకు ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం చేతుల మీదుగా బాధిత కుటుంబానికి చెక్కు అందజేశారు. అలాగే దహన సంస్కారాలకు మరో రూ. 10వేలు పంపిణీ చేశారు. ఈ క్రమంలో బాణసంచా పేలుడులో వారం క్రితం మృతి చెందిన నాగేంద్ర ఇంటికి ఎమ్మెల్యే వెళ్లారు. మృతుడి భార్య సుప్రియను పరామర్శించారు. వారికి తక్షణమే ఇల్లు మంజూరు చేయించాలని ఎంపీడీఓను ఆదేశించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ ఎల్లకట్టవ ప్రమాద ఘటనలో మృతుల కుటుంబాలకు పరిహారం అందించినట్లు వెల్లడించారు. కార్యక్రమంలో మండల పరిషత్ ప్రత్యేక ఆహ్వానితుడు దామోదర్ రెడ్డి, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ నాయుడు దయాకర్‌రెడ్డి, దేవాంగ కార్పొరేషన్ డైరెక్టర్ బొప్పన తిలక్‌బాబు, జేసీఎస్ కన్వీనర్ చిన్నా, సర్పంచుల సంఘం మండల అధ్యక్షుడు చంద్రారెడ్డి, సర్పంచులు చంద్రయ్య, దుడ్డు వేణు, తహసీల్దార్ గౌరీశంకరరావు, ఎంపీడీఓ సుబ్రమణ్యంరాజు, ఎస్ఐ పురుషోత్తమ్‌రెడ్డి పాల్గొన్నారు.

అప్పు చెల్లించలేదని వ్యక్తి నిర్బంధం

వెంకటగిరి(తిరుపతి జిల్లా): పట్టణంలోని ఏకలవ్య నగర్‌కు చెందిన జగన్నాదం నగేష్ అనే వ్యకి తీసుకున్న అప్పు తిరిగి చెల్లించలేదనే నెపంతో అదే ప్రాంతానికి చెందిన పూజారి వెంకటయ్య మూడు రోజులుగా ఇంట్లో నిర్బంధించిన ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. బాధితుడు నగేష్ భార్య పార్వతి సోమవారం ఎస్ఐ నరసింహరావుకు ఫిర్యాదు చేశారు. అనంతరం ఆమె మాట్లాడుతూ పదేళ్లక్రితం తాము వెంకటయ్య వద్ద రూ.50వేలు అప్పుగా తీసుకుని ఇప్పటికే పలు దఫాలుగా రూ.8.5 లక్షలు చెల్లించామని, అయితే ఇంకా తనకు రూ.8 లక్షలు ఇవ్వాలని వేధిస్తూ మూడు రోజుల నుంచి తన భర్త నగేష్‌ను వెంకటయ్య తన ఇంట్లో నిర్బంధించాడని వాపోయారు. దీనిపై ఎస్ఐ నరసింహరావు స్పందించారు. నగేష్‌ను విడిపించారు. కేసు దర్యాప్తులో ఉంది.

వెటర్నరీకి 31వ ర్యాంక్


శ్రీవేంకటేశ్వర వెటర్నరీ యూనివర్సిటీ పరిపాలనా భవనం

తిరుపతి ఎడ్యుకేషన్: నేషనల్ ఇన్‌స్టిట్యూషనల్ ర్యాంకింగ్ ఫ్రేమ్‌వర్క్(ఎన్ఐఆర్ఎఫ్) ర్యాంకింగ్స్‌లో స్థానిక శ్రీ వేంకటేశ్వర వెటర్నరీ యూనివర్సిటీ ముందంజ వేసింది. గత ఏడాది కన్నా 33 ర్యాంకులు మెరుగు పరుచుకొని 31వ స్థానంలో నిలిచింది. గత సంవత్సరం 64వ ర్యాంకు పొందగా ఈ ఏడాది 31వ ర్యాంకుకు సొంతం చేసుకుంది. కేంద్ర విద్యాశాఖ ఆధ్వర్యంలో పనిచేసే నేషనల్ ర్యాంకింగ్ ఫ్రేమ్‌వర్క్ సంస్థ దేశంలోని వివిధ విశ్వ విద్యాలయాల పనితీరును పరిశీలించి ప్రతి ఏటా ర్యాంకులు ఇస్తుంది. 2023వ సంవత్సరానికి సోమవారం ర్యాంకులు ప్రకటించింది. వ్యవసాయ అనుబంధ రంగాలకు చెందిన 40 అత్యుత్తమ ర్యాంకులు ప్రకటించగా అందులో తిరుపతిలోని శ్రీ వేంకటేశ్వర వెటర్నరీ యూనివర్సిటీ 31వ ర్యాంకు పొందడం విశేషం. బోధన, పరిశోధన, విస్తరణ, ప్లేస్‌మెంట్స్ ఆధారంగా ఇచ్చే ఈ ర్యాంకింగ్స్‌లో వెటర్నరీ మంచి ర్యాంకు సాధించింది. 100 మార్కులకు 43.83 మార్కులు సాధించింది.

మూడేళ్ల ప్రస్థానం

వెటర్నరీయూనివర్సిటీ గత మూడేళ్లుగా బోధన, పరిశోధన రంగాల్లో పురోగతి సాధించింది. ముఖ్యంగా దేశీయ ఆవుల పునరుత్పత్తికి, ఆ జాతి ఆవుల అభివృద్ధికి ఎంబ్రియోట్రాన్స్‌ఫర్ టెక్నాలజీ ప్రవేశ పెట్టింది. టీటీడీ సహకారంతో పరిశోధన ప్రాజెక్ట్ ప్రారంభించి గిర్, దేశీయ ఆవు జాతుల అభివృద్ధికి శ్రీకారం చుట్టింది. అలాగే టీటీడీ సహకారంతో గో సంరక్షణశాలలో ఫీడ్ అండ్ ఫాడర్ (దాణా) తయారీ ప్రాజెక్ట్ నిర్వహిస్తోంది. ఒంగోలు, పుంగనూరు ఆవుల అభివృద్ధికి పరిశోధనలు చేస్తోంది. ఇక్కడ యూజీ కోర్సులు పూర్తి చేసిన వారు మెరుగైన ఉన్నత విద్యావకాశాలు, ఉపాధి అవకాశాలు పొందుతున్నారు. దీని వల్ల మెరుగైన ర్యాంకు సాధ్యమైంది.

> **అందరి సహకారంతోనే...**
>
> 
>
> శ్రీ వేంకటేశ్వర వెటర్నరీ యూనివర్సిటీ అందరి సహకారంతో మంచి పురోగతితో ముందంజ వేస్తోంది. ఎంబ్రియో ట్రాన్స్‌ఫర్ టెక్నాలజీ(పిండిమార్పిడి సాంకేతికత) అభివృద్ధి చేశాం. దీంతో వర్సిటీ మెరుగైన ర్యాంకు పొందింది.
> – డాక్టర్ వి.పద్మనాభరెడ్డి, వైస్ చాన్సలర్, ఎస్వీ వెటర్నరీ యూనివర్సిటీ, తిరుపతి

బాలిక ఆచూకీ కోసం ముమ్మర గాలింపు


పద్మిని (ఫైల్)

తిరుచానూరు(చంద్రగిరి): గత నెల ఇంటి నుంచి కనిపించకుండా పోయిన బాలిక ఆచూకీ కోసం పోలీసులు ముమ్మరంగా గాలిస్తున్నారు. తిరుచానూరు పోలీసు స్టేషన్ పరిధిలోని సాయినగర్‌కు చెందిన నారాయణ, మంగమ్మ ఎపీఎస్పీడీసీఎల్ ప్రధాన కార్యాలయ సమీపంలో చిరు వ్యాపారం చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. వారికి ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. చిన్న కుమార్తె పద్మిని(10) ఇంటి నుంచి గత నెల 26వ తేదీన తల్లిదండ్రుల వద్దకు వెళ్లింది. అక్కడి నుంచి ఇంటికి వెళ్తున్నాని చెప్పిన బాలిక కనిపించకుండా పోయింది. దీంతో తల్లిదండ్రులు పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఎస్ఐ చిరంజీవి మాట్లాడుతూ బాలిక ఆచూకీ కోసం ప్రత్యేక బృందం ద్వారా గాలిస్తున్నట్లు తెలిపారు. పద్మిని ఆచూకీ తెలిసిన వారు తిరుచానూరు సీఐ–94407 96755, ఎస్ఐ– 98859 01901 నంబర్లకు సమాచారం అందించాలని ఆయన కోరారు.